వీధి వ్యాపారాల క్రమబద్ధీకరణకు ప్రణాళిక

42 జోన్లుగా విభజన

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగర సుందరీ కరణ, ట్రాఫిక్ సమస్యలు, ప్రజల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వీధి వ్యాపారాలను క్రమబద్ధీకరించనున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. ఇందుకోసం కాకినాడ నగరంలో వ్యాపారాలకు అనుకూలంగా లేని, అనువైన ప్రాంతాలను గుర్తించి 42 జోన్లుగా విభజించినట్లు ఆయన వెల్లడించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, మెప్మా అధికారులతో ఈ అంశంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న నగరాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల సౌకర్యార్థం కాకినాడను 11 రెడ్ జోన్లుగాను, 25 గ్రీన్ జోన్లగాను, 6 యాంబర్ జోన్లుగాను విభజించామన్నారు. గ్రీన్ జోన్లలో నిరంతరాయంగా వ్యాపారాలు చేసుకోవచ్చని, రెడ్ జోన్లలో మాత్రం వ్యాపారాలకు అనుమతించబోమని కమిషనర్ స్పష్టం చేశారు. యాంబర్, గ్రీన్ జోన్లలో వ్యాపారాలు చేసుకునేందుకు అనువుగా నగరపాలక సంస్థ తరఫున మంచినీటి సౌకర్యం, పారిశుధ్య నిర్వహణ, ఆయా ప్రాంతాలను చదును చేయడం వంటి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎస్ఈ పి. సత్య కుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డీసీపీ హరిదాస్, ఏసీపి నాగశాస్త్రులు, టిపిఆర్ఓ మానే కృష్ణమోహన్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకట రాజు, సిఓలు పాల్గొన్నారు.

ఆశ నిరాశలో చెల్లుబోయిన!

అందినట్టే అంది చేజారిన పదవి

విశాలాంధ్ర - అమలాపురం : ఆయనకు అదృష్టం గుమ్మం ముందుకు వచ్చి వెనక్కి వెళ్ళిపోతోంది. వైసీపీలో క్రియాశీలకంగా పని చేస్తూ అన్ని వర్గాల్లోనూ మన్ననల్ని అందుకుంటున్నారు చెల్లు బోయిన శ్రీనివాస్. శెట్టిబలిజ సామాజిక వర్గంలో వైసీపీకి పెద్ద దిక్కుగా ఉన్న చెల్లుబోయిన ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ఎప్పటికయినా తనకు మంచి పదవి ఇస్తారని నాలుగున్నరేళ్లుగా శ్రీనివాస్ ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆ అవకాశం వచ్చినట్టే వచ్చి మాయం అయిపోయింది. పార్టీ సొంత ఛానల్‌లోనే చెల్లుబోయిన శ్రీనివాస్‌కు ఏపీ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ డైరెక్టర్‌గా ప్రకటించింది. తీరా నియామకపు పత్రం చేతికి వచ్చేసరికి చెల్లుబోయిన పేరు తారు మారు అయ్యింది. విశాఖ ఎమ్మెల్సీ చెన్నుబోయిన శ్రీనివాస్‌ను ఆ పదవిలో నియమించినట్లు ఉత్తర్వులు రావడంతో చెల్లుబోయిన వర్గీయులు నిర్ఘాంత పోయారు. పాపం శ్రీనివాస్‌కు పదవి అందని ద్రాక్షగా మారడం ఆయన అభిమానుల్లో తీవ్ర నిరాశను మిగులుస్తోంది.

ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా చూడాలని సీఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని కాకినాడ ఆర్డీవో సత్యనారాయణ అన్నారు. కొత్త మూలపేట గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష" వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ ఆర్డిఓ సత్యనారాయణ, డిఎంహెచ్ఓ డాక్టర్ నరసింహ నాయక్ హాజరై మాట్లాడారు. పేదలకు పక్కాగా నాణ్యమైన ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష" కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, జిల్లాలో 20 క్యాంపులు నిర్వహిస్తున్నామని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని డిఎంహెచ్ఓ తెలిపారు. ఈ క్యాంపుల ద్వారా 7రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. ఉచిత వైద్య శిబిరాలలో ఉచితంగా ప్రజలకు వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేస్తారని కాకినాడ ఆర్డిఓ తెలియజేశారు.. ప్రజలంతా ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించే ఉన్నతమైన ఆశయంతో దేశంలో ఎక్కడ లేని విధంగా వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే దొరబాబు తెలిపారు ఈ కార్యక్రమంలో కొత్తపల్లి తహసీల్దార్ ప్రసాద్, వైసీపీ నాయకులు కారే శ్రీనివాసరావు, సర్పంచులు రావి రమేష్, నక్కా మణికంఠ బాబు, బండి రాణి దావీదు, ఉమ్మిడి జాన్, ఎండపల్లి పిఎసిఎస్ అధ్యక్షుడు గుండ్ర రాజబాబు, మండల వైకాపా నాయకుడు ఆనాల సుదర్శన్, సీనియర్ వైసీపీ నాయకుడు సానా నాగు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గడపగడపకు

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : తక్షణ సమస్యలు పరిష్కరించే దిశగా గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే దొరబాబు తెలిపారు. గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శ్రీరాంపురం గ్రామంలో సర్పంచ్ రావి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందజేసి, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నాళ్ళ నుంచో కీలకంగా ఉన్న సమస్య శ్రీరాంపురం కాకినాడ ఆర్టీసీ బస్సు వెయ్యాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరగా, దీంతో ఎమ్మెల్యే తక్షణమే స్పందించి ఆర్టీసీ అధికారులతో సంప్రదించి నేటి నుండే కాకినాడ శ్రీరాంపురం ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రజలకు హామీ ఇచ్చారు. అదేవిధంగా అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు అందజేస్తామని తెలియజేశారు. అనంతరం 35 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న శ్రీరాంపురం రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారేసుధ శ్రీనివాస రావు, మండల వైకాపా అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, సర్పంచులు నక్క మణికంఠ బాబు, బండి రాణి దావీదు, సీనియర్ వైకాపా నాయకుడు సానానాగు, ఎండపల్లి పిఎసిఎస్ అధ్యక్షుడు గుండ్ర రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం కృష్ణం పాలెంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వృద్ధాశ్రమానికి నల్లజర్ల మండలం చోడవరం నల్లజర్ల గ్రామాలకు చెందిన అల్లాడి రామకృష్ణ, దొడ్డికర్ల గంగాధర్ 22 వేల నూట పది రూపాయలు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చేతుల మీదుగా నిర్వాహకురాలు జి.శ్యామలాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలను శ్యామలాదేవి అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పొట్టి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

పూతరేకులు, కూరగాయలతో
చంద్రబాబుకు రైతుల మద్దతు

విశాలాంధ్ర - రావులపాలెం : చంద్రబాబునాయుడి అక్రమ అరెస్టును నిరసిస్తూ కొత్తపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో 23వ రోజు రావులపాలెంలో రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఆత్రేయపురం మండల క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, గ్రామపార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో కలసి రైతులు కూరగాయలతో, చిరు వ్యాపారులు పూతరేకులుతో ఐ యామ్ విత్ సిబిఎన్ అని చంద్రబాబు నాయుడికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టును నిరసిస్తూ అన్ని వర్గాలవారు అధినేతకు మద్దతు తెలియజేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్రేయపురం మండల క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, గ్రామపార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో పాటు రాష్ట్ర కార్యదర్శి, కొత్తపేట నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

90 గ్రామాల్లో మూడో దశ రీ సర్వే పనులు

కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో చేపట్టిన మూడో దశ రీ సర్వే పనులను ప్రణాళికాయుతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు.

గురువారం రాష్ట్ర భూ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ ఇతర అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, సర్వే అధికారులతో కలిసి హాజరయ్యారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకానికి సంబంధించిన రీ సర్వే పనుల పురోగతిని జిల్లాల కలెక్టర్లతో సీసీఎల్ఎ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా జిల్లాలో మూడో దశ కింద 90 గ్రామాల్లో రీ సర్వే పనులు చేపట్టినట్టు తెలిపారు.

ఈ నేపథ్యంలో రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేసి గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ వంటి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు సర్వే పనులు పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏడీ సర్వే బి.లక్ష్మీనారాయణ, ఇతర సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్లో నమోదు ప్రక్రియను పూర్తిచేయాలి

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణపై ఈఆర్‌వోలకు కలెక్టర్ ఆదేశాలు

విశాలాంధ్ర - కాకినాడ : ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)-2024లో భాగంగా ఈ నెల 27న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రదర్శించనున్న నేపథ్యంలో జిల్లాలో చేపట్టిన ఓటర్ల సర్వే ప్రక్రియలో పరిష్కరించిన అంశాలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో పొందుపరచాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కృతికా శుక్లా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల (ఈఆర్‌వోలు)ను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కోర్టుహాల్‌లో ఎస్ఎస్ఆర్-2024 రూపకల్పన ప్రక్రియకు సంబంధించిన పురోగతిపై కలెక్టర్ కృతికా శుక్లా.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్‌వో కె.శ్రీధర్‌రెడ్డితో కలిసి ఈఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురణ, ఫాం 6, 7, 8లకు సంబంధించిన అభ్యంతరాలపై పరిష్కారాలు, ఓటరు-జనాభా నిష్పత్తి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిశీలన, పరిష్కారం తదితరాలపై ఏడు నియోజకవర్గాల ఈఆర్వోలతో కలెక్టర్ సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 27న ఓటరు జాబితా ముసాయిదాను ప్రచురించడం జరుగుతుందన్నారు. 2024, జనవరి 5న జిల్లా ఓటర్ల తుది జాబితాను ప్రచురించడం జరుగుతుందని వివరించారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్‌డీవోలు ఎస్‌వీవీ సత్యనారాయణ, జె.సీతారామారావు, కాకినాడ మునిసిపల్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, కుడా వీసీ కె.సుబ్బారావు, కాకినాడ సెజ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

విశాలాంధ్ర - కిర్లంపూడి : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటి బాబు అన్నారు. గురువారం కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో సర్పంచ్ గౌరకపూడి వీరఅనంతలక్ష్మి, ఎంపీటీసీ గౌరకపూడి మమత, గౌరకపూడి వెంకట్రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గౌరకపూడి గోపీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, కిర్లంపూడి ఎంపిపి తోట రవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే దృఢ సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టి కార్పొరేట్ స్థాయిలో పేద ప్రజలకు వైద్య సదుపాయాన్ని అందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గౌరకపూడి వెంకట్రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గౌరకపూడి గోపీనాథ్ మాట్లాడుతూ కృష్ణవరం గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధికి సహకరిస్తున్న జ్యోతుల చంటిబాబుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తోట గాంధీ, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జ్యోతుల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషపై విద్యార్థుల్లో నూతన చైతన్యం తీసుకు రావాలి

విశాలాంధ్ర - రాజానగరం : మాతృభాషలోని గొప్పతనాన్ని, మాధుర్యాన్ని యువతకు, విద్యార్థులకు వివరిస్తూ అందరిలో నూతన చైతన్యం తీసుకు రావాలని అందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ సహాయచార్యులు డాక్టర్ తలారి వాసు అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కానవరం గ్రామంలోని గాయత్రి విద్యాసంస్థల్లో కళాశాల ప్రిన్సిపల్ దేవీ బంగారం అధ్యక్షతన గురువారం జరిగిన యువ నిర్మాణ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలుగు భాషలోని మాతృదేవోభవ, పితృదేవోభవ ,ఆచార్యదేవోభవ అనే పదాలకు అర్థాన్ని నేటితరం విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించా లన్నారు. అనంతరం అతిథిలకు దు శ్యాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో కళాశాల తెలుగు అధ్యాపకులు కొడమంచిలి రాజ్ కుమార్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువుల వాడకంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - మండపేట : పంటల దిగుబడి కోసం కొత్తగా తయారైన నానో ఎరువులను రైతులు ఏ విధంగా వాడాలనే దానిపై ఆ కంపెనీ ప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించారు. ఇప్పనపాడు బాబు అండ్ బాబు గోదాముల వద్ద గురువారం రైతు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇఫ్కో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధికారి గుంటక శ్యామ్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ నానో ఎరువులు వాడడం పట్ల రైతులకు లాభదాయకంగా ఉంటాయన్నారు. ఇఫ్కో నానో ఎరువుల పంట క్షేత్రాల్లో పిచికారి చేయడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. ఇఫ్కో నానో యూరియా, నానో డీఏపీలు చాలా అద్భుతంగా పనిచేస్తున్నాయన్నారు. త్వరలోనే డ్రోన్‌లను ఇఫ్కో సంస్థ అందుబాటులోకి తేనున్నారు. వాటిని అతి తక్కువ ధరకే రైతులకు ఇవ్వడానికి కంపెనీ సిద్ధంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని రైతులంతా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రైతులకు టీ-షర్ట్‌లు పంపిణీ చేసారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, ఇఫ్కో సిబ్బంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండలం కేంద్రంలో ర్యాలి గ్రామంలో 1 కోటీ 57 లక్షల రూపాయలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం, 35 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామసచివాలయం-1 భవనాలను ప్రభుత్వ విప్, శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిర్ల మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన ర్యాలి గ్రామంలో 1కోటి 57 లక్షల రూపాయలతో ప్రజలకు ఉచితంగా వైద్యం అందించే ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనాన్ని నూతనంగా నిర్మించుకుని ప్రారంభించామన్నారు. గ్రామ సచివాలయాల వ్యవస్థ ద్వారా గ్రామాలలో ప్రతీ 2000 మంది జనాభాకు ఒక గ్రామ సచివాలయం ఏర్పాటుచేసి, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లను నియమించి ప్రజలకు అన్ని ప్రభుత్వ పథకాలు నేరుగా వారి ఇంటి వద్దకే అందిస్తున్నారని అన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో సుమారు 300 కోట్ల రూపాయల పైనే నిధులతో ఆర్ అండ్ బి రోడ్లు, పంచాయతీ రోడ్లు, నాడు-నేడు ద్వారా పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు, జల జీవన్ మిషన్, నీటిపారుదల శాఖలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి చాలా వరకు పూర్తిచేసి ప్రారంభించుకున్నామని తెలిపారు.

అందరికీ ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజలందరికీ మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. స్థానిక 49వ డివిజన్ గైగోలుపాడులోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐదు రూరల్ డివిజన్లకు సంబంధించి గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ ఏఎన్ఎంలు, వాలంటీర్లు, వైద్య సిబ్బంది ద్వారా రాష్ట్రంలోని కోటి 60 లక్షల కుటుంబాల వద్దకు వెళ్లి సర్వే ద్వారా ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుని ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే వైద్య సేవలు అందిస్తోందన్నారు. నిపుణులైన వైద్యుల ద్వారా పరీక్షలు చేయించి అవసరమైన వారికి అత్యున్నత వైద్యాన్ని కూడా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఐ శ్రీను, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అర్బన్ క్లస్టర్ ఇన్చార్జ్ కడియాల చిన్నబాబు. వైఎస్ఆర్సిపి నాయకులు పాలిక రమణ, పెండ్యాల నాగేశ్వరరావు, నాగబాబు, పాటి సూరిబాబు, దేవరాజు పలువురు వైద్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోనసీమ జిల్లా ఆర్టీసీ అధికారి
నిరంకుశ విధానాలు మానుకోవాలి

విశాలాంధ్ర - అమలాపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆర్టీసీ ప్రజా రవాణా అధికారి కార్మిక వ్యతిరేక విధానాలపై జాయింటు కలెక్టర్‌కు యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సెప్టెంబర్ 14న 33 డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రానిన ధర్నా నిర్వహించి జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఇవ్వడానికి ప్రయత్నం చేయగా డిపిటిఓ అసోసియేషన్ ప్రతినిధులతో మాటాడడానికి నిరాకరించారని జాయింటు కలెక్టర్‌కు వివరించారు. సెప్టెంబర్ 21న అసోసియేషన్ ప్రతినిధులు డిపిటిఓకు సమస్యలు నివేదించుటకు సమయం కోరగా తిరస్కరించారన్నారు. ప్రభుత్వ పెన్షన్ లేదని, ఉన్న ఉద్యోగానికి భద్రత లేని నిబంధనలు తీసుకొచ్చారని, చిన్నపాటి తప్పులకు రిమూవలైన ఉద్యోగులకు అప్పీళ్ళలో ఇంకా ఉద్యోగాలు ఇవ్వడం లేదని, మెడికల్ అన్ ఫిట్ అయిన వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని, 1/2019 సర్క్యులర్‌ని సక్రమంగా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావలసిన 2017 పేస్కేలు ఏరియర్స్ నేటికీ చెల్లించలేదని, తాము కష్టపడి ఏర్పాటు చేసుకున్న ఎస్ఆర్బిఎస్, ఎస్బిటి స్కీములను రద్దుచేసి ఆ డబ్బుని నేటికీ తమకు ఇవ్వలేదని, పేర్కొన్నారు.

ఆరోగ్య సురక్ష విధులను బాధ్యతగా భావించాలి

విశాలాంధ్ర - అయినవిల్లి : ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యులు జగనన్న ఆరోగ్య సురక్ష విధులను బాధ్యతగా భావించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కోరారు. గురువారం శానపల్లిలంకలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుతో కలిసి ఆయన సందర్శించారు. ప్రతి విభాగంలో అందిస్తున్న సేవలను వారు స్వయంగా పరిశీలించారు. నెల్లి కనకదుర్గ అనే మహిళ రెండు కళ్లు కనిపించక ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించి, ఆమెను కంటి డాక్టర్ వద్దకు తీసుకెళ్ళి దగ్గరుండి కంటి పరీక్షలు చేయించారు. ఆమె చూపు దెబ్బతిన్నదని డాక్టర్ చెప్పాగా, ప్రభుత్వ ఖర్చుతో ఆపరేషన్ చేయిస్తామని కలెక్టర్ ధైర్యం చెప్పారు. వీరవల్లిపాలెం పిహెచ్‌సి డాక్టర్ సునీల్, డాక్టర్ క్రిస్టాఫర్‌ల ఆధ్వర్యంలో సుమారు 400 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంబల కుమారి, తహశీల్దార్ సిహెచ్ నాగ లక్ష్మమ్మ, సొసైటి చైర్మన్ మట్టపర్తి రామారావు, ఎంపిటిసి పచ్చిమాల సుబ్బారావు, మండల వైసిపి అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, అయినవిల్లి ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, బొంతు రాజేంద్ర ప్రసాద్, నక్కా చంద్ర మోహన్, పొలమూరి పవన్, ఆశా వర్కర్లు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై శిక్షణ తరగతులు

విశాలాంధ్ర - గండేపల్లి : అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్ఓ) న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఎస్ఐవైబి (ఎస్ఐవైబి) చిన్న వ్యాపారాన్ని ప్రారంభించడం, అభివృద్ధి పరచడం మరింత మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగు పరచడం అనే అంశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాల గురించి 8 రోజుల పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ శిక్షణకు ముఖ్య అతిథిగా పుల్లూరు హేమాద్రి, ఎస్ఐవైబి మాస్టర్ ట్రైనర్, అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ), న్యూఢిల్లీ, డాక్టర్ జి. రామకృష్ణ, డీన్, కర్రి మనోజ్ కుమార్ రెడ్డి, కె. బాల శివ తరుణ్ కుమార్, బి సాయి తేజ, పాల్గొన్నారు. ఆసక్తి గల వారు ఈ సదవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలి అని నిర్వాహకులు కోరారు.

విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

స్వచ్ఛత ఏక్ సంకల్పం ప్రతిజ్ఞ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : మనం నివసించే ప్రాంతం, మనం చదువుకునే ప్రాంతంలో పరిశుభ్రత పాటించడం ద్వారా అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు సహాయ పడుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత పేర్కొన్నారు. గురువారం స్థానిక మురమండ లో జరిగిన "స్వచ్ఛత ఏక్ సంకల్పం" కార్యక్రమంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో స్వచ్ఛత సేవా ప్రతిజ్ఞ చేయించి, శానిటేషన్ వర్కర్లతో తేనీటి విందు స్వీకరించి, అనంతరం వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత మాట్లాడుతూ చెత్తను బయట వెయ్యవద్దని, ఎవ్వరినీ వెయ్య నివ్వకుండా చూడాలని, పిల్లలు పెద్దల్లో, చుట్టు పక్కల వారిలో అవగాహన కలిగించాలని పిలుపు నిచ్చారు. ప్రతి గ్రామంలో విద్యార్థులు స్వచ్ఛతా బృందాలుగా ఏర్పడి స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏ. రుక్మిణి, డిపివో జేవి సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి. బాల శంకర్ రావు , ఐసిడిఎస్ పిడి కె. విజయ కుమారి, డిఈవో ఎస్. అబ్రహం, స్థానిక ప్రజా ప్రతినిధులు స్టాలిన్, మండల స్థాయి అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

విశాలాంధ్ర-కొవ్వూరు : ఒకరు రక్త దానం చేస్తే ముగ్గురికి ప్రాణ దానం చేసినవారు అవుతామని ఏబీఎన్, పి ఆర్ ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నందిగం వెంకట సుబ్బారావు అన్నారు. గురువారం స్థానిక కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అత్యవసర పరిస్థితులలో రక్తం అందక చాలామంది ప్రాణాలు కోల్పోతుంటారని అన్నారు. విద్యార్థులకు రక్త దానం పట్ల అవగాహన కల్పించటమే కాకుండా, రక్త దాన శిబిరములను ఏర్పాటుచేసి వారికి సమాజ సేవాభావాన్ని పెంపొందించాలని అన్నారు. గవర్నమెంట్ హాస్పిటల్ రక్త నిధి వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం లో గవర్నమెంట్ హాస్పిటల్ రాజమహేంద్రవరం బ్లడ్ డొనేషన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత కొవ్వూరు గవర్నమెంట్ హాస్పిటల్ రక్త నిధి ప్రతినిధులు జి. అరుణ్ కుమార్, కె ఏ నీలిమ, కళాశాల ఎన్ఎస్ఎస్ పి ఓ . పి శ్రీనివాస ప్రవీణ్, కళాశాల ఫిసికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మురళి, అధ్యాపక -అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. సుమారు 73 మంది విద్యార్థులు రక్తదానం చేసినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులకు అవయవదానం పట్ల అవగాహన కల్పించి వారిచేత ప్రతిజ్ఞ చేయించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-దేవరపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని గోపాల పురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పేర్కొన్నారు. దేవరపల్లి మండలం ధూమంతుని గూడెం గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరంగం రామలక్ష్మి పిహెచ్సి డాక్టర్ సాంబశివరావు దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ పొట్టి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

మనసున్న మారాజు 'జక్కంపూడి రాజా'

విశాలాంధ్ర - సీతానగరం: మంచి మనసున్న మారాజు జక్కంపూడి రాజా అని దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి రమేష్ బాబు(డాక్టర్ బాబు) అన్నారు. మండలంలో సీతానగరం గ్రామంలోని కస్తూర్బా గాంధీ సెంటర్లో డాక్టర్ బాబు ఆధ్వర్యంలో గురువారం రాజా నగరం నియోజకవర్గ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాటవరం, రఘుదేవపురం, రాపాక, చినకొండేపూడి, వంగలపూడి, ముగ్గుళ్ళ మొదలగు గ్రామాల్లో ఎమ్మెల్యే పుట్టినరోజు పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గం అభివృద్ధికి అహర్నిశలు రాజా పనిచేస్తున్నారని అన్నారు.రాబోయే ఎన్నికల్లో తిరిగి రాజానగరం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా అఖండ మెజారిటీతో గెలుపొందాలని ఆకాంక్షించారు. దీనిలో భాగంగా వృదులకు, పిల్లలకు స్వీట్లు, పండ్లను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ్రపు ముత్యాలు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, పల్లీ, మద్దాల కొండలరావు, రైతు బరోసా ఛైర్మెన్ వలవల వెంకటరాజు, కొల్లి శ్రీను, లాయర్ దాకే రఘు మొదలగు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష క్యాంపులను సందర్శించిన జగ్గిరెడ్డి

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం మండలం గోపాల పురం గ్రామంలో తేతలి వారి కళ్యాణ మండపం, ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రభుత్వ విప్, శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి సందర్శించారు. అక్కడ అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

ప్రజారోగ్యంపై జగనన్న దృష్టి

విశాలాంధ్ర-పెరవలి : అన్నవరప్పాడు గ్రామంలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి వై.యస్. జగన్మోహన్ రెడ్డి సంక్షేమం, సుపరిపాలన, అభివృద్ధే లక్ష్యంగా పరిపాలన సాగిస్తూ, ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

వార్డు సభ్యునిగా మట్టపర్తి

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: మండలంలోని దమ్మెన్ను గ్రామపంచాయతీ 9వ వార్డు సభ్యునిగా మట్టపర్తి అచ్యుతరామయ్య గురువారం పంచాయతీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థిగా బరిలో నిలిచి, గెలిచారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ పరిధిలో వివిధ ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించాల్సిందిగా సర్పంచ్ గురజర్ల వీర వెంకట సత్యనారాయణ ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరి వెంకటకృష్ణ, సోమా వెంకటేశులు, ఎంఎస్ఎల్ ఎన్. శిరీష, వి. కోటేశ్వరరావు, కె. కాంతి కుమారి, వి. శివాని, కె. వెంకట్రావు, జె. సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర- జీలుగుమిల్లి : మండలంలోని వంక వారి గూడెం సచివాలయ పరిధిలో గురువారం వాల్మీకి విజ్ఞాన కేంద్రం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశ పెడుతున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అందజేస్తున్నట్లు ఆయన అన్నారు. ప్రజలు అభివృద్ధిని చూసి రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్ కే అవకాశం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొరస పోచమ్మ, జడ్పిటిసి మల్లం వసంతరావు,మండల కన్వీనర్ చందా ప్రసాద్,సొసైటీ అధ్యక్షులు బోద శ్రీనివాసరెడ్డి, ఘంటసాల గాంధీ, మండల సచివాలయ కన్వీనర్ వనమా రామకృష్ణ, సర్పంచ్ కుంజా పార్వతి, ఎంపీటీసీ సున్నం సురేష్,కోఆప్షన్ సభ్యులు బి ప్రేమ్ కుమార్, గూడవల్లి శ్రీనివాసరావు, కుంజ రాముడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-భీమడోలు: ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ జై రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని గుండు గొలనులో జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలపై ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతోనూ సమావేశమై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్నటువంటి సంక్షేమ కార్యక్రమాలు పొంది అందరూ ఉన్నత విద్యావంతులుగా తయారు కావాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి వారికి ఉన్న హక్కులను పొందుతూ తమ జీవితాలను అభివృద్ధి పరచుకోవాలన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను విద్యార్థులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణ ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-పెదవేగి: ప్రజల ఆరోగ్య పరిరక్షణ జగనన్న ప్రభుత్వ లక్ష్యమని దెందులూరు శాసనసభ్యులు కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. దిబ్బగూడెం, లక్ష్మీపురం గ్రామంలో గురువారం జరిగిన జగనన్న సురక్షా కార్యక్రమాన్ని శాసనసభ్యులు ప్రారంభించారు.ఈ సందర్భంగా అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించి పూర్తి స్థాయి ఆరోగ్యాన్ని అందించాలని ముఖ్య మంత్రి జగన్ సంకల్పంతో జగనన్న సురక్షా పథక ఉద్దేశమని తెలిపారు.అన్ని వర్గాల ప్రజలు ఈ పథకం ద్వారా అందించే వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.లక్ష్మీపురం లో జరిగిన జగనన్న సురక్షా కార్యక్రమానికి లక్ష్మీ పురం, ఎం ఆర్ సి కాలనీ,వీరం పాలెం గ్రామాలనుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో పెదవేగి ఎంపిపి తాతా రమ్యకుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ దెందులూరు చైర్మన్ మేకా లక్ష్మణరావు,లక్ష్మీపురం ఎంపిటిసి,పెదవేగి సొసైటీ చైర్ పర్సన్ పెనుమాక వెంకట సుబ్బారావు, మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్.ఎన్ నాగరాజు, ఎంపిడిఓ జి. రాజ్‌మనోజ్, వైద్యాధికారులు, ఐసిడిఎస్, సచివాలయ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రత్నకుమారి, భవ్యశ్రీలను హత్య చేసిన వారిని అరెస్ట్ చేయాలి

విశాలాంధ్ర - గణపవరం: భీమవరం విద్యార్థి రత్నకుమారి, భవ్యశ్రీ లపై అత్యాచారం, హత్య చేసిన దోషులను వెంటనే శిక్షించాలని ఏబీవీపీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గణపవరం గ్రామంలో నిరసన తెలిపారు. ఏలూరు ఏబీవీపీ విభాగ్ సంఘటన్ కార్యదర్శి ఎం. వెంకటేష్ మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం విద్యార్థిని రత్నకుమారి,అనంతరం జిల్లా విద్యార్థిని భవ్యశ్రీలపై జరిగిన అత్యాచారం, హత్యలపై నిరసన వ్యక్తం చేస్తూ గణపవరం ప్రధాన రహదారిపై పెద్దఎత్తున విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని రత్నకుమారి, భవ్యశ్రీ లపై అఘాయిత్యం చేసిన వారిని శిక్షించాలని, వారి కుటుంబాలకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గ ఏబీవీపీ కన్వీనర్ కె. జితేంద్రనాథ్ ఆధ్వర్యంలోజరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సందీప్, మోహన్, విద్యార్థి పరిషత్ నాయకురాళ్ళు జోయ్, లక్ష్మి ఝాన్సీ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం విషసంస్కృతిని విడనాడాలి

విశాలాంధ్ర-వీరవాసరం: పత్రికా, మీడియాపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విషసంస్కృతి విడనాడాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆంజనేయులు అన్నారు. ఎపిడబ్లుజెఎఫ్ ఆధ్వర్యంలో మీడియా రంగంపై దాడులను ఖండిస్తూ గురువారం వీరవాసరంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ మీడియా రంగం పై జరుగుతున్న దాడులను ప్రజా స్వామ్య వాదులు, రాజకీయ నాయకులు ఖండించాలని కోరారు. న్యూఢిల్లీలో న్యూస్ క్లిక్ కార్యలయంపై మోడి ప్రభుత్వం చేసిన దాడి భావప్రకటనా స్వేచ్ఛ గొంతు నొక్కడమేనన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు నాటి ఎమర్జెన్సీ రోజులను గుర్తుకు తెస్తున్నాయన్నారు. ఎటువంటి నేరారోపణలు చేయకుండానే ఉగ్రవాద నిరోధక చట్టం కింద న్యూస్‌క్లిక్ సంస్థ ఎడిటర్ ప్రబీర్కురాయస్థ, అమిత్ చక్రవర్తిని అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. ఇటువంటి చర్యల ద్వారా రాజ్యాంగాన్ని, అది నెలకొల్పి విలువలను, ప్రజాస్వామ్య స్ఫూర్తిని మోడి ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్టు ఎడిటర్ ఎ. అమరయ్య, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు గుండా రామకృష్ణ, నవీన్, వి. రాధాకృష్ణంరాజు, నాని, ఎఎన్టివి. ప్రసాద్, నెల్సన్, సూర్య, ఎస్. శివ, పి మోహన్, సాయిబాబులు పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అడహాక్ కమిటీఏర్పాటు

విశాలాంధ్ర-వీరవాసరం: పత్రికా విలేకర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎపి డబ్ల్యుజెఎఫ్ పని చేస్తుందని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆంజనేయులు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా సన్నాహక సమావేశాన్ని గురువారం వీరవాసరంలో నిర్వహించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర నాయకులు నవీన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమాఖ్య చేపట్టబోయే భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ సంఘటితం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు. పారదర్శకమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆదర్శంగా ఉంటుందన్నారు. అనంతరం జిల్లా అడహాక్ కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వి. రాధా కృష్ణంరాజు, నాని, ఎన్టివి ప్రసాద్, నెల్సన్, సూర్య, ఎస్. శివ, పి మోహన్, గుండా రామకృష్ణ, సాయిబాబులను కమిటీగా ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎపిడబ్లుజెఎఫ్ నాయకులు ఎ. అమరయ్య, వేంద్ర శివప్రసాదు, శంకరరావు, జబ్బీర్, వివిధ ప్రాంతాల నుండి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన విలేకర్లు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో భారీ జరిమానా

విశాలాంధ్ర - కిర్లంపూడి : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆరుగురు వ్యక్తులకు భారీ జరిమానా విధించినట్లు కిర్లంపూడి ఎస్ఐ ఉమామహేశ్వర తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద తమ సిబ్బందితో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురు ద్విచక్ర వాహనదారులను, ఒక కారు డ్రైవర్ను, ఒక ఆటో డ్రైవర్ను అదుపులోకి తీసుకుని ప్రత్తిపాడు కోర్టులో హాజరు పరచగా ఒక్కొకరికి 10 వేల రూపాయలు చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై ఉమామహేశ్వర తెలిపారు.

ఈవీఎంల పనితీరు రాజకీయ పార్టీలు పరిశీలించాలి

జిల్లా కలెక్టర్ పి . ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: జిల్లాకు అందిన ఈవీఎంల పనితీరును రాజకీయ పార్టీల ప్రతినిధుల కూడా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఈవీఎంల పనితీరు, ఓటర్ల జాబితా సవరణల పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 3,640 ఈవీయంలు అందాయని, వాటిలో కంట్రోల్ యూనిట్లు 3,640, బ్యాలెట్ యూనిట్లు 4,650, వివి ప్యాడ్స్ 4,548 ఉన్నాయన్నారు. బెంగళూరు నుంచి వచ్చిన సంబంధిత ఇంజినీర్లు తొలుత ప్రతి యూనిట్‌కు యాక్సెప్టెన్సీ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూనిట్ల పనితీరు పరిశీలన అనంతరం ఈనెల 16వ తేదీ నుండి ఫస్ట్ లెవెల్ చెకింగ్ నిర్వహించనున్నారన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు స్వయంగా వచ్చి పరిశీలించి ధ్రువీకరించాల్సి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియను కూడా ఈవీఎం గోదామును సందర్శించి పరిశీలించాల్సిం దిగా కోరారు. పోటీలో ఉన్న అభ్యర్థులు 16 మంది కన్నా ఎక్కువగా ఉంటే రెండు బ్యాలెట్ యూనిట్లను వినియోగించనున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా వివిధ రాజకీయ పార్టీల నుండి అందిన విజ్ఞాపనల మేరకు డబుల్ ఎంట్రీస్ పరిశీలన పక్కాగా నిర్వహించామన్నారు. ఎక్కువ వ్యత్యాసాలు లేవని, ఓటర్లుగా వాస్తవంగా ఉన్నారని, తప్పుగా ఉన్న ఎంట్రీలను తొలగించినట్లు పేర్కొన్నారు. వాటికి సంబంధించిన నివేదికలను కూడా సంబంధిత పార్టీ ప్రతినిధులకు అందజేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె. కృష్ణవేణి, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దారు యం.సన్యాసి రావు, వివిధ పార్టీల ప్రతినిధులు కామన నాగేశ్వర రావు వైస్సార్ సిపి, మరపట్ల శ్యాంబాబు టిడిపి, కోమటి రవి కుమార్ బిజెపి, జెయన్ వి.గోపాలన్ సిపిఐ(యం), తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ క్లిక్‌పై ఈడీ దాడులు : ప్రెస్ క్లబ్ నిరసన

విశాలాంధ్ర - పాలకొల్లు: న్యూస్ క్లిక్ పై ఇ.డి దాడులు చేసినందుకు నిరసనగా పాలకొల్లు ప్రెస్ క్లబ్ సభ్యులు, ప్రజా సంఘాలు నిరసన తెలిపాయి. ఈ మేరకు గురువారం డిప్యూటీ తహశీల్దార్ సిహెచ్ రవిరాజుకు వినతి పత్రం సమర్పించారు. మీడియా సభ్యులపై దాడి ప్రజాస్వామ్యం పై దాడిగా వర్ణించారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు విన్నకోట వెంకట రమణ, కార్యదర్శి ఎంఎన్వి సాంబశివరావు, ఎపియుడబ్లుజె జిల్లా ఉపాధ్యక్షులు పిటి వెంకటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టులు మండెల అప్పలరాజు, సరగం శ్రీనివాస్,జి ఉదయ్ భాస్కర్, ప్రజా సంఘ నేతలు యర్రా అజయ్,చల్లా సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర - నిడదవోలు : యునెస్కో సూచనల మేరకు అక్టోబర్ 5 న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటామని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు అధ్యక్షులు కీర్తి ఆంజనేయులు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ఆధ్వర్యంలో డి.ముప్పవరం ప్రాథమికోన్నతపాఠశాలలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా, రోటరీ డిస్ట్రిక్ట్ ఎక్స్‌టెన్షన్ చైర్మన్ గోపిరెడ్డి శ్రీనివాస్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు అధ్యక్షు లు కీర్తి ఆంజనేయు లు మాట్లాడుతూ మనదేశంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజైన సెప్టెంబర్ 5ను ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటామన్నారు.యునెస్కో, అంతర్జాతీయ కార్మిక సంస్థ, ఉపాధ్యాయులకు సంబంధించిన హక్కులు బాధ్యతలు ప్రకటన ఆమోదించిన అక్టోబర్5న, ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపు కుంటున్నామన్నారు. ఈ సందర్భంగా పదవి విరమణ చేసిన ప్రధానోపాధ్యాయులు గ్రంధి సత్య నారాయణ, పొన్నా సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయులు ముప్పిడి సత్య శ్రీనివాస్, ఎం తిరుపతి రావు లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో గుంటుపల్లి నాగ వెంకట శివ కుమార్, కాళ్ళ రాంబాబు, గొన్నాబత్తుల రామారావు, క్లబ్ ఒకేషనల్ డైరెక్టర్ కారింకి సాయిబాబు, కొత్తపల్లి నాగేశ్వరరావు, రొటేరియన్స్ కంకటాల నాగేంద్ర ,బట్టు భీమరాజు గ్రామ పెద్దలు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు స్టెమ్ కోర్సులపై పట్టు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం రూరల్ : శాస్త్ర, సాంకేతిక, ఇంజనీరింగ్, గణితం వంటి (స్టెమ్) కోర్సులపై విద్యార్థులు పట్టు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని ఏపీ నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్ సూచించారు. తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాల్లోని భాష్యం విద్యా సంస్థల్లో తొమ్మిది, పదో తరగతి చదువుతున్న 572 మంది విద్యార్థులు గురువారం ఏపీ నిట్ ప్రాంగణాన్ని సందర్శించారు. ప్రాంగణ నమూనా, ఇండోర్ స్టేడియం, ప్రయోగశాలలు, వర్క్ షాప్ లు, గ్రంథాలయాన్ని పరిశీలించారు. ప్రయోగశాలాల్లోని పరికరాల పనితీరు, వాటి ప్రాధాన్యతను విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సందీప్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సాంకేతికత, భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. సృజనాత్మక ప్రతిభ కలిగిన విద్యార్థులకు డిమాండ్ ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. చదువు, సాంకేతికతతోపాటు చిన్నతనం నుంచే సామాజిక భాధ్యతను అలవాటు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు సొంతంగా పరిశ్రమలను ఏర్పాటుచేసి పారిశ్రామిక వేత్తలుగా ఎదగటంతోపాటు ఎంతోమందికి జీవనోపాధి కల్పించాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం పాటుపడాలని తెలిపారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం భాష్యం జోనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏ.ఎస్.ఎన్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఎన్.రమేష్ నిట్ ఆచార్యులు సందీప్‌ను శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు.

సహకార సంఘాల ముఖ్య కార్యనిర్వహణాధికారులకు శిక్షణ

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ముఖ్య కార్యనిర్వహణాధి కారులకు సహకార చట్టం 1964నకు ఇటీవల వచ్చిన సవరణలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా సహకార అధికారి జాయింట్ రిజిస్ట్రారు,జిల్లా సహకార అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలను నిర్వహించుటకు చట్టనిబంధనలపై అవగాహన ముఖ్యమన్నారు. ఇటీవల సహకార సంఘములను బలోపేతం చేయుటకు ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించారు.ఈ శిక్షణా కార్యక్రమంలో తొలుత విజయవాడ సహకార శిక్షణ కేంద్ర ప్రిన్సిపాల్ ఎం. రామ్మోహన్ ఈ శిక్షణ కార్యక్రమం ఉద్దేశ్యము, శిక్షణ ఆవశ్యకతను వివరించారు. అనంతరం రాష్ట్ర సహకార యూనియన్ అధ్యాపకులు ఆర్. శ్రీనివాసరావు, సహకార సంఘములను బలోపేతం చేయుటకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను వివరించారు. జిల్లా సహకార ఆడిట్ అధికారి ఎ.శ్రీనివాస్ 1964 సహకార చట్టమునకు ఇటీవల చేసిన సవరణలు వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఓ. ఎస్ .డి. అజిత్ కుమారి, డివిజనల్ సహకార అధికారి అబ్దుల్ హదీ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నరసింహారాజు, ఇతర సహకార శాఖ సిబ్బంది హాజరయ్యారు. డివిజనల్ సహకార అధికారి వారి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

ఘనంగా వైస్ చైర్మన్ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబ జాన్ మోజెస్ పుట్టినరోజు వేడుకలను తన నివాసం వద్ద అభిమానులు ఘనంగా నిర్వహించారు. కో ఆప్షన్ సభ్యులు కార్మిక సంఘం నాయకులు దవులూరి సుబ్బారావు సమక్షంలో వైస్ చైర్మన్ జాన్ మోజస్ దంపతులు కేక్ కట్ చేసి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు పిట్ట సత్యనారాయణ, పాలిక కుసుమ చంటిబాబు, రెడ్నం సునీత, పెండ్యాల వెంకటలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు చల్లారి కల్యాణ్, మున్సిపల్ కమిషనర్ రామారావు, తదితరులు వైస్ చైర్మన్ మోజస్‌కు పూలదండలు వేసి, పుష్ప గుచ్ఛాలి ఇచ్చి, శాలువలు కప్పి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సిఆర్‌పిలు, మున్సిపల్ సిబ్బంది, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు.

24 వ రోజుకుచేరిన దీక్షలు

విశాలాంధ్ర - నిడదవోలు : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా చంద్రబాబును వెంటనే విడుదల చెయ్యాలని కోరుతూ నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన పార్టీల ఆధ్వర్యంలో పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో 24వ రోజు గురువారం నిరాహార దీక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ టీడీపీ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సైకో జగన్ రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చారని విమర్శించారు. ఈ శిబిరంలో పట్టణ టీడీపీ సెక్రటరీ తిరుపతి సత్యనారయణ, జనసేన టౌన్ అధ్యక్షులు రంగా రమేష్ జనసేన వీర మహిళ బెల్లంకొండ పుష్పావతి, తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గొల్లలగుంటలో మహాశక్తి ప్రచారం

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని గొల్లలగుంటలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ, చైతన్య రథయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రథయాత్ర కమిటీ దాపర్తి సీతారామయ్య, కంచుమర్తి రాఘవ హాజరై గ్రామంలో మహిళలతో ఇంటింటికీ తిరిగి టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన పోవాలంటే చంద్రబాబు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొత్త కొండబాబు, తిరుమలరాజు మురళిరాజు, చింతాకుల ఈశ్వరరావు, రాయుడు గోవిందు, గుమ్మళ్ల అనంతలక్ష్మి, తిప్పన సత్యవతి, రాపాక లక్ష్మీ, గెద్దడ సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత ఏక్ సంకల్ప్

విశాలాంధ్ర - తాళ్లపూడి : పరిసరాలను పరిశుభ్రం గా ఉంచుతా అంటూ గ్రామాల్లో స్వచ్ఛత ఏక్ సంకల్ప్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేగేశ్వర పురం గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు అధ్యక్షతన ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. అనంతరం హై స్కూల్ లో జరిగిన కార్యక్రమంలో పిల్లలకు పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తూ, ర్యాలీ నిర్వహించారు .ఈ కార్యక్రమం లో ఆర్.డబ్ల్యు.ఎస్. ఏ.ఈ సూర్జాన్ పంచాయతీ కార్యదర్శి డి.ఎస్. శ్రీనివాస్, సిబ్బంది నాగాంజ నేయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కానూరులో: స్వచ్ఛత ఏక్ సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ భావన మధు పూర్ణ చందు అధ్యక్షతన గురువారం కానూరులో గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్)లో భాగంగా గృహాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. చెత్త రహిత గ్రామాలుగా మన గ్రామాలు ఉండాలని దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ బాల సరస్వతి మాట్లాడుతూ ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు వాడొద్దని, క్లాత్ బ్యాగ్‌లు వాడాలని సూచించారు. అనంతరం స్వచ్ఛ సంకల్ప ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమంలో భాగంగా క్లాప్ మిత్రాలతో కాఫీ సేవించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది ,అంగన్వాడీ టీచర్లు ,గ్రామ వాలంటీర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో : తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మండలంలో స్వచ్ఛత ఏక్ సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలలో పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులచే ప్రతిజ్ఞలు చేయించి, మానవహారాలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఆయాలు, విద్యాశాఖ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాబుకు తోడుగా రిలే దీక్షలు

విశాలాంధ్ర - పిఠాపురం టౌన్ : తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో బాబుకు తోడుగా రిలే దీక్షలు 23వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా మాజీ ఆత్మ చైర్మన్ రాజారావు మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో చంద్రబాబు నాయుడు ఏ అవినీతికి పాల్పడలేదన్నారు. కావాలనే ముఖ్యమంత్రి జగన్ కక్షపూరితంగా చంద్రబాబు నాయుడుని జైల్లో పెట్టారని అన్నారు. నేటివరకు ఏపీ సిఐడి అధికారులు ఎటువంటి సాక్షాలు కోర్టులో సబ్మిట్ చెయ్యలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓడిపోతుందని తెలుసుకుని ఎలాగైనా చంద్రబాబు పై కక్ష తీర్చుకోవాలని జగన్ ఈ దారుణానికి పాల్పడ్డాడని ఆ సందర్భంగా ఆయన అన్నారు.

కొనసాగుతున్న టీడీపీ రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ముమ్మిడివరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సంఘీభావంగా 23వ రోజు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముమ్మిడివరం మాజీ శాసనసభ్యులు చెల్లి వివేకానంద మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు, జగన్మోహన్ రెడ్డి పాలన ఒక నియంత పాలన అని, అరాచకాలు, అక్రమాలు, అవినీతి ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది వైయస్సార్ ప్రభుత్వమేనన్నారు. ఈ దీక్షలో గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, దొమ్మేటి రమణ కుమార్, అర్ధాని శ్రీనివాసరావు, విల్ల వీరస్వామి నాయుడు, కురసాల శివబాబు, తాడి నరసింహారావు, వాసంశెట్టి అమ్మాజీ, బొక్కా రుక్మిణి, కుడుపూడి మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-దేవరపల్లి : గ్రామాల అభివృద్ధి మౌలిక సదుపాయాలు కల్పన ప్రభుత్వ ధ్యేయమని గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లి మండలం సంగాయిగూడెంలో గురువారం జగనన్న కాలనీలో మంచినీటి పైపులైను, మండల పరిషత్ నిధులు ఐదు లక్షల రూపాయలతో నిర్మించిన గ్రావెల్ రోడ్డు ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు ఎంపీటీసీ సుంకవెల్లి చిన్న నాగ వెంక కనకదుర్గ, జెడ్పీటీసీ పొట్టు స్వర్ణలత, వైస్ ఎంపీపీ సాది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పండు కుటుంబాన్ని పరామర్శించిన రవి

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : ఉప్పులగుప్తం మండలం బడుగువారి పేట గ్రామానికి చెందిన పండు వీరభద్రం ఇటీవల మరణించారు. అయన స్వగృహం వద్ద ప్రార్ధనా కూడిక కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా కార్యదర్శి ఉచ్చిల రవి పాల్గొని వీర భద్రం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉండ్రు ప్రసాద్, మొసలి శ్రీను (ఎంఎస్ఆర్)పండు, చిరంజీవి, మధుర శ్రీను, మధుర ప్రతాప్, పి సత్యనారాయణ, మొసలి నాని, సరేళ్ళ వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయమే గెలుస్తుంది

విశాలాంధ్ర - రాజానగరం : టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టులో చివరికి న్యాయమే గెలుస్తుందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అక్రమ అరెస్టు,రిమాండ్ని నిరసిస్తూ పార్టీ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన రాజానగరంలో బాబుతో నేను సామూహిక రిలే నిరాహార దీక్షలో మహిళలు,పార్టీ శ్రేణులు, గురువారం రిలే నిరాహారదీక్షల్లో పాల్గొన్నారు. దీనిలో భాగంగా పార్టీ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ కలిసి మద్దతు పలికారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ బాబుకు, లోకేష్‌కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి వైసీపీ నేతల వెన్నులో వణుకు పుడుతోందన్నారు. కేవలం ఆరోపణలను ఆధారాలుగా చూపుతూ చంద్రబాబుని అరెస్టు చేసి,రిమాండ్ కి పంపించిన విధానాన్ని ప్రజలు కూడా ఒక్కసారి ఆలోచించాలని పిలుపునిచ్చారు. అక్రమ అరెస్టుకు ఖండిస్తూ సంతకాలు సేకరణ చేపట్టారు. దీక్షలో కూర్చున్న వారికి పార్టీ సీనియర్ నాయకులు నీలపాల అరవరాజు నిమ్మరసం ఇవ్వడంతో దీక్షను విరమింపజేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గంగిశెట్టి చంటిబాబు, జిల్లా తెలుగు యువత అధ్యక్షులు కందుల బాబు రాయుడు, ఎస్సి సెల్ జిల్లా కార్యదర్శి ఖండవిల్లి లక్ష్మీ, నాయకులు తోటకూర నాగేశ్వరరావు,బత్తుల త్రిమూర్తులు,నూనె వెంకన్న,కొల్లం రత్నం,సొడసాని త్రిమూర్తులు,మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తంలో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : ఉప్పలగుప్తం మండలం పేరాయి చెరువులో సర్పంచ్ కడిమి చిన్నవరాజు చేతుల మీదుగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రారంభించి ఇంటి దగ్గరికే ప్రభుత్వ సేవల్ని తీసుకొచ్చిన సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గడప వద్దకే వైద్యాన్ని తీసుకొచ్చారని జెడ్పీటీసీ గెద్దం సంపద రావు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిఎం & హెచ్ఓ యం దుర్గరాయ్ దోర, మండల తహసీల్దార్ జె. వెంకటేశ్వరి, ఎంపీడీవో కెవి విజయప్రసాద్, ఈఓపిఆర్డి కెఎస్ గౌరీ కుమారి, ఐసిడిఎస్ సూపర్వైజర్ కే. అన్నపూర్ణేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జీ తెలుగులో తెలుగు మీడియం ఇస్కూల్, జాబిల్లి కోసం ఆకాశమల్లే ప్రారంభం!

విశాలాంధ్ర-రాజమండ్రి: జీ తెలుగులో ఇదివరకెన్నడూ లేని విధంగా సరికొత్త కాన్సెప్ట్ టెలివిజన్ రంగంలో విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుట్టబోతోందని ఆ ఛానెల్ ప్రతినిధి చెప్పారు. తెలుగు భాష, సంస్కృతి సంప్రదాయాలను బోధిస్తూనే కడుపుబ్బా నవ్వించేందుకు 'తెలుగు మీడియం ఇస్కూల్' అనే విభిన్నమైన నాన్ ఫిక్షషోతో ప్రేక్షకుల ముందుకు రాబోతోందన్నారు. పుట్టుకతోనే కష్టాల పాలైన ఓ యువరాణి కథతో జాబిల్లికోసం ఆకాశమల్లె అనే సరికొత్త సీరియల్ని కూడా అందిస్తోందన్నారు. బాలీవుడ్ బ్యూటీ సన్నీ లియోన్ ముఖ్య అతిథిగా ప్రారంభం కానున్న తెలుగు మీడియం ఇస్కూల్ అక్టోబర్ 8 నుంచి ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు, అదేవిధంగా జాబిల్లి కోసం ఆకాశమల్లె అక్టోబర్ 9 నుంచి సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటలకు, జీ తెలుగులో పారంభం కానున్నదన్నారు. వీటి వల్ల రాజేశ్వరీ విలాస్ కాఫీ క్లబ్ మధ్యాహ్నం 12 గంటలకు, మావారు మాస్టారు. సాయంత్రం 4 గంటలకు ప్రసారమవుతాయని చెప్పారు.

15 వరకు సంతూర్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు

విశాలాంధ్ర-రాజమండ్రి: విప్రో కేర్స్ సహకారంతో సంతూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ ఏడవ ఎడిషన్‌ను ప్రారంభించామని విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ ప్రకటించింది. ఇది 12వ తరగతి, తత్సమాన విద్య అనంతరం ఉన్నత విద్యాభ్యాసం చేయాలని కోరుకునే వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థినులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని విప్రో లిమిటెడ్ గ్లోబల్ హెడ్ సస్టైనబిలిటీ అండ్ సోషల్ ఇనిషియేటివ్స్ పి.ఎస్. నారాయణ్ తెలిపారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా మరియు ఛత్తీస్‌గఢ్‌లలోని విద్యార్థినులు ఈ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. తాజా అధ్యయన నివేదికల మేరకు, దేశంలో (18-21 సంవత్సరాలకు) ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థినుల స్థూల నమోదు నిష్పత్తి 27.3 శాతం గా ఉందని, ఇది సంతూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ వంటి పథకాలను జారీ చేయవలసిన అవసరాన్ని గుర్తు చేస్తుందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన సముదాయాలు, అల్పసంఖ్యాత వర్గాలకు చెందిన విద్యార్థినులు ఉన్నత విద్యను అభ్యసించే నిష్పత్తి కేవలం 8 శాతం ఉండడం ఆందోళన కలిగించే అంశం అని చెప్పారు.